1

నవతెలంగాణ

ఆదిలాబాద్

శుక్రవారం | మార్చి 29, 2024 | www.navatelangana.com

ఉపాధి పనులను పరిశీలించిన డీఆర్డీఓ

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులను డిఆర్‌డిఓ సాయన్న గురువారం పరిశీలించారు. పనులు ప్రతి కూలీకి అందే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో కూలీలు ఉదయం పూట పనులకు వెళ్లాలని సూచించారు. పని చేసిన ప్రతి కూలీకి డబ్బులు సకాలంలో అందే విధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, ఏపీవో జగ్‌దేవ్‌రావు, టిఏ మధుకర్ పాల్గొన్నారు.



అధ్యాపకురాలికి పీహెచ్‌డీ పట్టా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో జువాలజీ సబ్జెక్టులో బోధిస్తున్న సాలెహా తబస్సుం పీహెచ్‌డీ పట్టా పొందారు. గ్లోబల్ సెక్యూరిటీపై వాతావరణ మార్పు ప్రభావం అనే అంశంపై యునైటెడ్ నేషన్స్ లెన్స్ ద్వారా నిర్వహించిన పరీక్షలో సఫలం కావడంతో ఉత్తరప్రదేశ్‌లోని సహారన్‌పూర్‌లో గల 'గ్లోకల్ యూనివర్సిటీ' ఆమెకు పిహెచ్‌డి ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా ప్రయాణంలో తల్లిదండ్రులు, భర్త మార్గనిర్దేశం చేశారని చెప్పారు. పట్టా పొందిన ఆమెకు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కళాశాల బృందం, మిత్రులు అభినందనలు తెలుపుతూ భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.



ప్రత్యర్థులు ఖరారు..!

- అభ్యర్థులను వెల్లడించిన ప్రధాన పార్టీలు
- తాజాగా కాంగ్రెస్ నుంచి బరిలో ఆత్రం సుగుణ
- ఆదిలాబాద్ స్థానంలో ముగ్గురు ఉపాధ్యాయులే
- గెలుపే లక్ష్యంగా వ్యూహాలకు పదును పెడుతున్న పార్టీలు
- మరింత రసవత్తరంగా మారనున్న ప్రచార పర్వం

లోక్‌సభ సమరం మరింత రసవత్తరంగా మారనుంది. రాష్ట్రంలో అధికార పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థిని వెల్లడించింది. లోక్‌సభ బరిలో నిలిచే ప్రధాన పార్టీల అభ్యర్థులెవరో తేలిపోవడంతో ఎన్నికల సమరం మరింత రసవత్తరంగా మారనుంది. ఇప్పటికే పెద్దపల్లి లోక్‌సభ బరిలో నిలిచే అభ్యర్థులను ఆయా పార్టీలు వెల్లడించినా.. ఆదిలాబాద్ లోక్‌సభకు పోటీ చేసే అభ్యర్థులను బీఆర్ఎస్, బీజేపీ వెల్లడించినా.. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం జాప్యం చేసింది. తాజాగా ఉట్నూర్‌కు చెందిన ఆత్రం సుగుణ పేరును ఖరారు చేయడంతో ఉత్కంఠకు తెరపడింది. ఈ స్థానం నుంచి టికెట్ కోసం 22మంది పోటీపడినా.. ఆ పార్టీ అధిష్టానం మాత్రం చివరకు సుగుణ అభ్యర్థిత్వం వైపే మొగ్గుచూపింది. దీంతో ఉమ్మడి జిల్లా పరిధిలోని ఈ రెండు స్థానాల నుంచి పోటీ చేసే అభ్యర్థులు ఎవరో తేలిపోవడంతో ప్రచార పర్వం మరింత ఊపందుకోనుంది. పలువురు అభ్యర్థులు ఇప్పటికే వివిధ రూపాల్లో ప్రచారం ప్రారంభించినా..పూర్తిస్థాయిలో జనాల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.


ఆత్రం సుగుణ, కాంగ్రెస్, ఆదిలాబాద్

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిపోవడంతో రానున్న లోక్‌సభ ఎన్నికలను రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. విజయమే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అత్యధిక లోక్‌సభ సీట్లే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా పెద్దపల్లి స్థానంలో తొలి విడతలోనే గడ్డం వంశీని అభ్యర్థిగా ప్రకటించగా.. ఆదిలాబాద్ లోక్‌సభ స్థానానికి మాత్రం ఆచితూచి వ్యవహరించింది. సునీల్ కనుగోలు సర్వేతో పాటు పలు సర్వేలు నిర్వహించిన ప్రజల్లో పలుకుబడి కలిగిన వారి వైపే మొగ్గుచూపింది. ఇప్పటికే నలుగురు అభ్యర్థులను పరిశీలించగా.. చివరగా ఇద్దరు..అందులో చివరగా ఆత్రం సుగుణను ఎంపిక చేస్తూ తాజాగా నిర్ణయం తీసుకుంది. ఇక రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికల్లో సత్తాచాటి జిల్లాలో పట్టు సాధించాలని భావిస్తోంది. ఇందులో భాగంగా పెద్దపల్లి నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేరును ఖరారు చేయగా.. ఆదిలాబాద్ లోక్‌సభ స్థానానికి ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు టికెట్ కేటాయించింది. బీజేపీ నుంచి పెద్దపల్లి స్థానానికి గోమాస శ్రీనివాస్ పేరును ప్రకటించగా.. ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావును కాదని.. బీఆర్ఎస్ నుంచి ఇటీవలే బీజేపీలో చేరిన మాజీ ఎంపీ గోడం నగేష్‌ను బరిలో దింపుతోంది.

ప్రచారం ముమ్మరం..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండు లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఇందులో మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలు పెద్దపల్లి లోక్‌సభ స్థానం పరిధిలోకి వస్తాయి. మిగితా ఏడు నియోజకవర్గాలైన ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, నిర్మల్, ముధోల్, ఆసిఫాబాద్, సిర్పూర్‌లు ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోకి వస్తాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఈ రెండు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయడంతో ప్రచారం మరింత ముమ్మరం కానుంది. ఇప్పటి వరకు కేవలం సోషల్ మీడియా వరకే పరిమితమైన ప్రచారం రానున్న రోజుల్లో మరింత ఊపందుకోనుంది.పార్టీల అభ్యర్థులు ఇంకా ప్రత్యక్ష ప్రచారంలోకి దిగలేదు. మరోపక్క ఇతర పార్టీల నుంచి వలసల చేరికతో కాంగ్రెస్ జోష్ మీద కనిపించగా.. బీఆర్ఎస్ ఎన్నికల కోసం తన క్యాడర్‌ను సమాయత్తం చేస్తోంది. బీజేపీ అభ్యర్థి ఆత్మీయ సమ్మేళనాల పేరిట ప్రజల్లోకి వెళ్తున్నారు. ఎన్నికలకు మరో నెలన్నర సమయం ఉండటంతో రానున్న రోజుల్లో వాహనాల ద్వారా ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నట్లు ఆయా పార్టీల నేతలు చెబుతున్నారు.


గడ్డం వంశీ, కాంగ్రెస్, పెద్దపల్లి


కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్, పెద్దపల్లి


ఆత్రం సక్కు, బీఆర్ఎస్, ఆదిలాబాద్


గోమాస శ్రీనివాస్ బీజేపీ, పెద్దపల్లి


గొడెం నగేష్, బీజేపీ, ఆదిలాబాద్

ఆ ముగ్గురు ఉపాధ్యాయులే..!

ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో పోటీ చేయనున్న మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు సైతం ప్రభుత్వ టీచర్లే కావడం విశేషం. ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చారు. కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచిన ఆత్రం సుగుణ ఉట్నూర్‌లోని జడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తూ ఇటీవల ఉద్యోగానికి రాజీనామా చేసి ఎంపీ టికెట్ దక్కించుకున్నారు. తిర్యాణి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఆత్రం సక్కు ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. బజార్‌హత్నూర్ మండలం జాతర్ల గ్రామానికి చెందిన గోడం నగేష్ ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లో వచ్చారు. ఎమ్మెల్యే, మంత్రిగా, ఎంపీ పనిచేశారు. తాజాగా మరోసారి బీజేపీ నుంచి ఎంపీగా పోటీలో నిలిచారు. ఈ ముగ్గురు అభ్యర్థులు కూడా ఉపాధ్యాయ వృత్తి కావడం విశేషం.

సిబ్బందికి పోలింగ్‌పై పూర్తి అవగాహన కల్పించాలి

- ఎన్నికల అధికారి వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నికల్లో విధులు నిర్వహించాల్సిన సిబ్బందికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత మాస్టర్ ట్రైనర్లపై ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించే మాస్టర్ ట్రైనర్లతో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వరరావు కలిసి సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో విధులు నిర్వహించే పిఓ, ఏపీఓలకు ఈవీఎం వివి ప్యాట్‌లపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. 17 సి డైరీలో రాసే ప్రతి అంశంతో పాటు, ఎన్నికల రోజు నింపే వివిధ ఫారాలు, పూర్తి అయిన తర్వాత ప్యాక్ చేసే కవర్లు వాటి ఉపయోగాలు వివరించాలన్నారు. ఎన్నికల రోజు మాక్ పోలింగ్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. సిబ్బంది ఇలాంటి తప్పులు లేకుండా విధులు నిర్వహించేలా చూడాల్సిన బాధ్యత శిక్షకులపై ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ తహసీల్దార్ శ్రీనివాసరావు, శిక్షకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యానంతో శాంతి : జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలో గల పులాజి బాబా ధ్యాన కేంద్రాన్ని గురువారం జెడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి జీవితం పరుగులతో కొనసాగుతున్నందున రోజుకు కనీసం 30 నిమిషాల నుండి గంట వరకు ధ్యానం చేసినట్లయితే శాంతి యుతంగా ఉంటుందన్నారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ఆత్మజ్ఞాన సదస్సు చివరి రోజు కావడంతో గ్రామస్తులతో పాటు ఇతర మండలాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వీరికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో పిరమిడ్ మాస్టర్ సునీత, అధ్యక్షులు సురేష్‌రెడ్డి, కాటిపెల్లి సునీతరెడ్డి, నీలగిరి అశోక్, కాటిపెల్లి వెంకట్‌రెడ్డి భక్తులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



మండలంలోని కొత్తగూడ గ్రామానికి చెందిన దేవర్తి శివయ్య(48) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం..పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న శివయయ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మూత్ర పిండాల వ్యాధితో బాధ పడుతూ మనస్థాపం చెంది చెట్టుకు ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతునికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

పోలీసుల కవాతు



నవతెలంగాణ-బేల

లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా మండల కేంద్రంలో గురువారం సిఆర్‌పిఎఫ్ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాధిక మాట్లాడుతూ ప్రజల్లో ఓటరు చైతన్యంతో పాటు, భయభ్రాంతులకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా ధైర్యం కల్పించడానికి ఈ కవాతు నిర్వహించామని తెలిపారు.

నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వ నిబంధనల మేరకు లే అవుట్, భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌తో కలిసి ఆయన జిల్లా స్థాయి లే అవుట్ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలోని పట్టణ, మండల, గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ లే అవుట్, భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. అక్రమ లేఅవుట్లు, నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న భవన నిర్మాణాలను నిలిపివేయాలని సూచించారు. నూతన లేఅవుట్‌లలో రోడ్లు, డ్రైనేజి, విద్యుత్ వంటి వాటిని పరిశీలించి అనుమతులు మంజూరు చేయాలన్నారు. అలాగే నిబంధనల మేరకు నూతన భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని సూచించారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను కమిటీ బృందం క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించాలని తెలిపారు. ప్రభుత్వ స్థలాలలో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డిఓ రత్నకల్యాణి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బి శాఖల ఇంజనీరింగ్ అధికారులు శంకరయ్య, అశోక్ కుమార్, మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి సుమలత పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అడ్రస్ గల్లంతు

- మాజీ మంత్రి జోగు రామన్న
- నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అడ్రస్ గల్లంతవుతుందని, ప్రధాన పోటీ బీఆర్ఎస్, బీజేపీ మధ్యనే ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అమలులో ఘోరంగా విఫలమైందన్నారు. పార్టీ నుండి కొంత మంది నాయకులు వలస వెళ్తే ఎటువంటి నష్టం లేదని, ప్రజలంతా తమ వైపే ఉన్నారని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ పార్టీ ఘన విజయం సాధించనుందని ధీమా వ్యక్తం చేశారు.

నేడు ఇఫ్తార్ విందు

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నేడు నిర్వహించనున్న ఇఫ్తార్ విందులో ముస్లిములు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. 29న సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఇఫ్తార్ విందు ఉందని తెలిపారు. 1500 మందికిపైగా విందులో పాల్గొనేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ముస్లిములు ప్రత్యేక ప్రార్థనలు ఆచరించేందుకు తగు ఏర్పాట్లు చేశామని, అన్ని మసీదుల ఇమామ్‌లు, సదర్లు కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, నాయకులు సాజిదొద్దీన్, యూనిస్ అక్బాని, రోకండ్ల రమేష్, అసిఫ్, సలీం పాషా, అన్సర్ హైమద్, అసిఫ్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా మల్లారెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిసినట్లు ఎన్నికల అధికారులు షేర్ నరేందర్, కొమ్మోజి రమణ తెలిపారు. అధ్యక్షులుగా అల్లూరి మల్లారెడ్డి, ఉపాధ్యక్షులుగా వై.కవితరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఎ.ముత్తన్న, కోశాధికారిగా ఎ.నర్సారెడ్డి, క్రీడా సాంస్కృతిక కార్యదర్శిగా పి. వంశీకృష్ణ, గ్రంథాలయ కార్యదర్శిగా సిహెచ్.అర్చన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి పోస్టుకు ఎన్నిక నిర్వహించగా వోస మహేందర్, తన ప్రత్యర్థి ఎస్.లింగయ్యపై 38 ఓట్లతో తేడాతో విజయం సాధించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి సహకరించిన న్యాయవాదులకు ఎన్నికల అధికారులు ధన్యవాదాలు తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నగేష్

- హోరాహోరీగా ఎన్నికల ప్రక్రియ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం కోర్టు ప్రాంగణంలో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్ష, క్రీడల కార్యదర్శి పదవులకు ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా ముస్కు రమణారెడ్డి, వినోద్‌రెడ్డి, భావనసింగ్ వ్యవహరించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్ష పదవులకు ముగ్గురు చొప్పున పోటీ పడ్డారు. క్రీడల కార్యదర్శి పదవికి ఇద్దరు బరిలో నిలిచారు. మొత్తం 16 నామినేషన్లు రాగా అందులో రెండు తిరస్కరణకు గురయ్యాయి. సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, మహిళ ప్రతినిధుల పదవులు ఏకగ్రీవం కాగా నాలుగు పదవుల కోసం ఎన్నికలు జరిగాయి. మొత్తం 171 మంది ఓటర్లు ఉండగా 159 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారులు సాయంత్రం కౌంటింగ్ చేపట్టి ఫలితాలు వెల్లడించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మరోమారు ఎన్రాల నగేష్ 20 మెజార్టీతో ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలిగా రజితరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సంతోష్‌కుమార్, క్రీడా కార్యదర్శిగా ముజాహిద్ హుస్సేన్ ఎన్నికైనట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు. వారికి పలువురు అభినందనలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | మార్చి 29, 2024 | www.navatelangana.com

కరువు భత్యం అమలు చేయాలి : ఐఎఫ్టీయూ

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్



బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం అమలు చేయాలని ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సునారి కారి రాజేశ్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని బీర్నంది గ్రామంలో కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. కొత్త ముసాయిదాను వెంటనే జీఓగా తీసుకురావాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న బీడీలు చుట్టే కార్మికులందరికి ఒకే విధంగా వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ దుర్గం లింగన్న, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

మట్కా ఏజెంట్ల అరెస్టు

నవతెలంగాణ-తాంసి



భీంపూర్ మండలంలో మట్కా జూదం కొనసాగుతున్నట్లు సమాచారం రావడంతో గురువారం ఎస్ఐ ప్రదీప్ కుమార్ సిబ్బందితో గోవింద్‌పూర్ గ్రామ సమీపంలో దాడులు నిర్వహించారు. ఇందులో మట్కా నిర్వహణ ఏజెంట్లు భగత్ జైపాల్ మహారాష్ట్రలోని పాటోదా, కరండే సౌరబ్ భీంపూర్ మండలం కమట్ వాడ, బెల్సార్ రాంపూర్ గ్రామాలకు చెందిన సిడం జంగు మట్కా చిట్టిలు రాస్తుండగా వారిని పట్టుకున్నారు. వారి వద్దనుండి రూ.3240 నగదు, మట్కా చిట్టీలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైన మట్కా జూదం కొనసాగుతున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలని కోరారు.

సుగుణక్కను భారీ మెజార్టీతో గెలిపిస్తాం



నవతెలంగాణ-బేల

ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఆత్రం సుగుణక్కను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలంతా కలిసికట్టుగా కృషి చేస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫైజుల్లా ఖాన్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా ఆత్రం సుగుణ పేరు ఖరారు చేయడంపై ఆ పార్టీ శ్రేణులు గురువారం బేల మండల కేంద్రంలో సంబరాలు జరుపుకున్నారు. మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలతో మమేకమయ్యేలా రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతోందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే, ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు ఆడే శంకర్, ఎంపీటీసీ అరుణ్, విలాస్ పటేల్, రమేష్ పటేల్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోడే అవినాష్, మాజీ సర్పంచులు సీతారాం, భారత్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు విఠల్, సీనియర్ నాయకులు విజయ్ గంభీర్ రాందాస్, ఘన్ శ్యామ్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ

పనులు త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- లక్ష్మీపూర్ చెక్‌పోస్టు తనిఖీ, 'పది' పరీక్ష కేంద్రం పరిశీలన

నవతెలంగాణ-తలమడుగు

వేసవి ప్రారంభమైన నేపథ్యంలో తాగు నీటి ఎద్దడి లేకుండా మిషన్ భగీరథ పనులను త్వరగ పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. సుంకిడిలోని మిషన్‌భగీరథ పనులను పరిశీలించారు. నాణ్యత పాటించాలని అధికారులకు సూచించారు. వేసవిలో పూర్తి స్థాయిలో నీటిని అందించేల ప్రణాళికలు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్‌భగీరథ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు లక్ష్మీపూర్ చెక్‌పోస్టును సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ వాహనాల రాకపోకల రిజిస్టర్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. తలమడుగు తాంసి, భీంపూర్ మండలాలకు నీటిని సరఫరా చేసేందుకు సంపును నిర్మిస్తున్నట్లు తెలిపారు. వెంటనే సంపు నిర్మాణాలు చేపట్టి పూర్తి చేయాలని ఆయా శాఖ అధికారులను ఆదేశించారు. లక్ష్మీపూర్ గ్రామ గిరిజనులు నీటి సమస్యపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించి పరిశీలిస్తామని భరోసా ఇచ్చారు. తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహారాష్ట్ర సరిహద్దు కావడంతో రూ.50 వేల డబ్బులుకంటే ఎక్కువ తీసుకెళ్లరాదని, ఆపై డబ్బులు ఎక్కువ తీసుకెళ్లినట్లయితే డబ్బుకు సంబంధించిన పూర్తి పత్రాలు చూపించాలన్నారు. జిల్లాలో 6 ఇంటర్ స్టేట్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు మిగిలిపోకుండా ఇప్పటికైనా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట పంచాయతీరాజ్ శాఖ ఈఈ మహావీర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ చంద్రమోహన్, డీఈ రమణ, ఏఈ ప్రశాంత్, గ్రిడ్ మహేష్, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీఓ శేఖర్, ఎస్సై ధనశ్రీ, ఏఎస్ఐ సురేందర్, ఆప్కారి శాఖతో పాటు వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ..

మండల పర్యటనకు వచ్చిన కలెక్టర్ రాజర్షి షా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. గురువారం నాటి పరీక్షకు 206 మంది హజరు కావాల్సి ఉండగా 205 మంది హాజరయ్యారు.



లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా



సుంకిడి సంప్ వద్ద వివరాలు అడుగుతున్న కలెక్టర్ రాజర్షి షా

'రాహుల్‌గాంధీకి గిఫ్టుగా ఆదిలాబాద్ ఎంపీ స్థానం ఇస్తాం'



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థిగా ఆత్రం సుగుణను ప్రకటించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ ఏఐసీసీకి ధన్యవాదాలు తెలుపుతున్నామని పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఆత్రం సుగుణను గారిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఒక సాధారణ కార్యకర్తగా ఇందిరమ్మ ఇంట్లో ఉండే వెడ్మ బొజ్జును ఖానాపూర్ ప్రజలు శాసన సభ్యులుగా గెలిపించుకొని, కాంగ్రెస్, రేవంత్ రెడ్డికి బహుమానంగా ఇచ్చారన్నారు. నేడు ఆదివాసుల పోరాట బిడ్డ ఒక మహిళా శక్తిగా టీచర్‌గా ఎన్నో పోరాటాలు చేసిన ఆత్రం సుగుణక్కని ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా గెలిపించుకొని రాహుల్ గాంధీకి బహుమతిగా ఇస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కాడే సంతోష్, నాయకులు అలిమ్ మహేందర్, వెంకన్న, సలీమ్, అబ్దుల్లా ఉన్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు



నవతెలంగాణ-నిర్మల్

రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనికి గురువారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు హాజరయ్యారు. మండలం అక్కాపూర్ గ్రామ సమీపంలో కొత్తగా నిర్మించిన ఆలయంలో ఐదు రోజులుగా ప్రతిష్టాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన శ్రీహరి రావు మాట్లాడుతూ భక్తుల ఇలవేల్పు రేణుక ఎల్లమ్మ అనుగ్రహం అందరికీ అందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దైవజ్ఞ గురువు మంచి చంద్రశేఖర శర్మ పూజలు చేయించి ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ గీత పారిశ్రామిక సహకార సంఘం ప్రతినిధులు, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో ఐహెచ్ఎఫ్ఎంఎస్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు, ఈపీఎఫ్ చెల్లించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, పెండింగ్ వేతనాలు ఈపీఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమచేసేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం జిల్లా కేంద్రంలోని డీసీఎల్ అధికారి సునీతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిమ్స్‌లో 380 మంది శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యురిటీ గార్డులు పనిచేస్తున్నారన్నారు. నూతనంగా జరిగిన అగ్రిమెంట్‌లో కార్మికులకు జీఓ నం.60 ప్రకారం వేతనాలు నెలకు రూ.15,600 చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అగ్రిమెంట్‌లో జీఓ నం.60 పొందుపరిచిందన్నారు. ఈ జీఓ ప్రకారం సదరు కాంట్రాక్టర్ కార్మికుల ఖాతాలో రూ 12,093, పీఎఫ్ ఖాతాలో రూ.3023, ఈఎస్ఐ రూ.484 జమచేయాలని అన్నారు. కానీ క్రిష్ణ కాంట్రాక్టర్ తక్కువ కమిషన్‌తో టెండర్ దక్కించుకుని కార్మికుల వేతనాల్లో కోతలు విధిస్తూ లాభం పొందుతున్నారని ఆరోపించారు. అగ్రిమెంట్, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వేతనం రూ.11,000 మాత్రమే చెల్లిస్తున్నారని ఈపీఎఫ్, ఖాతాల్లో రూ. 1300, ఈఎస్ఐ రూ.100 మించి చెల్లించడం లేదన్నారు. కావున వెంటనే జీఓ నం.60ను అమలు పరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అగ్రిమెంట్ జరిగిన నాటినుండి కోత విధించిన వేతనాలు, ఈపీఎఫ్ డబ్బులు రికవరీ చేసి కార్మికుల ఖాతాల్లో జమచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీనియర్ శానిటేషన్ కార్మికులను పేషంట్ కేర్‌లుగా ప్రమోట్ చేయ్యాలని, ప్రతినెలా పే స్లిప్‌లను కార్మికులకు ఇవ్వాలని కోరారు. డిమాండ్లను నెరవేర్చని పక్షంలో సమ్మెకు వెళ్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, నాయకులు రమేష్ ఉన్నారు.

'కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నాం'



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నేతకాని సామాజిక వర్గాన్ని కించపరిచేలా గుమ్మడి కుమార్ స్వామి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దుర్గం శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. గుమ్మడి కుమార్ స్వామి నేతకాని సమాజాన్ని కించపరిచేలా, మనోభావాలను దెబ్బతీసేలా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే ఆయన బహిరంగ క్షమాపణలు చెప్పి ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఓ కులాన్ని దూషించేలా, అవమానించేలా వ్యాఖ్యలు చేయడం ఎట్టి పరిస్థితుల్లోనూ సరికాదని మండిపడ్డారు. నేతకాని జాతికి నీతి లేదంటూ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని అన్నారు. సామాజిక ఉద్యమాలు, పోరాటాలలో తమ జాతి ముందుండి పోరాడిందని అనాదిగా వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాలను ముందుకు తీసుకెళ్తున్నామని స్పష్టం చేశారు. నేతకాని సమాజ చరిత్ర గురించి తెలియక మతిలేని మాటలు మాట్లాడారని ధ్వజమెత్తారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతమైతే తమ నుండి తీవ్రస్థాయి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సర్పె సోంబాయి, నేతకానీ మహర్ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్ మహాత్మే, జిల్లా మహిళా కోర్డినేటర్ జాడి విటాబాయి, పట్టణ యూత్ అధ్యక్షులు రాహుల్, కార్యదర్శి సూరజ్ సౌస్ కాంబ్లె పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు



నవతెలంగాణ-తలమడుగు

ఎన్నికల్లో కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్సై ధనశ్రీ తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. రూ. 50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకువెళ్లరాదన్నారు. అత్యవసర సమయాల్లో ఎక్కువ నగదు తీసుకెళ్లాల్సి వస్తే దానికి సంబంధించిన ఆధారాలను చూపాలన్నారు. మండలంలో అక్రమంగా మద్యం, గంజాయి విక్రయిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మండలంలో పోలీసు నిఘాతో పాటు బందోబస్తు పగడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల శాంతి భద్రతల కోసమే పోలీస్ శాఖ ఎల్లవేళలా పనిచేస్తుందన్నారు. దీనికి మండల ప్రజల సహకారం అవసరమన్నారు. శాంతి భద్రతలకు ఆటంకం కలిగించ కుండా మండల ప్రజలు సహకరించాలని కోరారు. విలేకరుల సమావేశంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వరి కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి : అదనపు కలెక్టర్



నవతెలంగాణ-నిర్మల్

వరి కొనుగోలుపై శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో డీసీఎంఎస్, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, లారీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో వరి పంట కోతకు వచ్చిన తరుణంలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కేంద్రానికి వచ్చిన వరిని సరైన తేమ శాతం వచ్చిన తర్వాతనే లోడింగ్ చేయాలని సూచించారు. కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి తాపం పెరిగిపోతున్నందున మంచి నీటి సదుపాయాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించాలన్నారు. హమాలీల కొరత లేకుండా చూడాలన్నారు. లారీ అసోసియేషన్ వారు వరి కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సహకరించాలన్నారు. లారీ లోడ్ అయిన తర్వాత అన్‌లోడింగ్ అయ్యేంత వరకు దానికి సంబంధించిన ఆన్‌లైన్‌లో వివరాల ఎంట్రీ, జియో టాగింగ్ తదితర అంశాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం లో సివిల్ సప్లయ్ డీఎం శ్రీకల, డీసీఎస్ఓ నందిని, డీసీఓ నర్సయ్య, ఏడీ మార్కెటింగ్ అశ్ఫాక్, అధికారులు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందేలా చూడాలి

నవతెలంగాణ-ఉట్నూర్



పిల్లలకు పౌష్టికాహారం అందేలా చూడాలని ఐటీడీఏ పీఓ గుష్బు గుప్తా గురుకులాల ప్రిన్సిపళ్లకు సూచించారు. గురువారం ఐటీడీఏలోని తన చాంబర్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం అందించి, నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని ప్రిన్సిపళ్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్సీఓ గంగాధర్, వివిధ గురుకుల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీలో గెలిపించాలి

నవతెలంగాణ-బోథ్

ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం అన్నారు. బుధవారం సొనాల గ్రామంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం మాట్లాడుతూ పార్టీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్నపు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రూ.370 వేల కోట్లతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఇవన్నీ కేంద్ర నిధులతో అభివృద్ధి చేశామని తెలిపారు. మారుమూల గ్రామాలకు బీటీ రోడ్లతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కోఆర్డినేటర్ మయూర్‌చంద్ర, నాయకులు జీవీ రమణ, గొల్ల రాజు, సుభాష్, సూర్య కదం ప్రశాంత్, రాజేశ్వర్, రాజు పాల్గొన్నారు.



నిజాయితీ చాటుకున్న మున్సిపల్ కార్మికులు

- పోగొట్టుకున్న బంగారం మహిళకు అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఓ మహిళ పోగొట్టుకున్న బంగారు ఆభరణాన్ని తిరిగి ఆ మహిళకు మున్సిపల్ డ్రైవర్, లేబర్ అందించి వారి నిజాయితీని చాటుకున్న ఘటన జిల్లా కేంద్రంలో జరిగింది. పట్టణంలోని బ్రాహ్మణవాడకు చెందిన మంగళశర్మ రెండు తులాలకుపైగా బంగారు ఆభరణాన్ని అనుకోకుండా గురువారం చెత్తబుట్టిలో పడేసుకుంది. ఆ చెత్తబుట్టని మున్సిపల్ స్వచ్ఛభారత్ వాహనం రావడంతో అందులో చెత్తతో సహా ఆ బంగారు ఆభరణం కూడా మున్సిపల్ బండిలో అనుకోకుండా వేసేసింది. అయితే కొంత సమయం తర్వాత మహిళ తన బంగారం కనపడకపోవడంతో ఇంట్లో వెతకడం ప్రారంభించింది. ఆ విషయాన్ని మున్సిపల్ డ్రైవర్, లేబర్‌కు తెలియజేయగా అప్పటికే ఆ చెత్తను బంగారుగూడలోని డంపింగ్ యార్డులో వేసేశామన్నారు. దీంతో మహిళ ఒక్కసారిగా కంగుతున్నది. ఆ మహిళా డ్రైవర్ శ్యామ్, లేబర్ రమేష్‌తో తెలియజేయడంతో డంపింగ్ యార్డ్‌కు వెళ్లి వెతకాగా బంగారు ఆభరణం దొరికింది. దొరికిన ఆ బంగారు ఆభరణాన్ని బ్రాహ్మణవాడకు వెళ్లి మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దర్శనాల నగేష్, డ్రైవర్ల విభాగం అధ్యక్షుడు జనార్ధన్, డ్రైవర్ రవీందర్, అడ్డూరి ఆశన్న ఆధ్వర్యంలో ఆ మహిళలకు అందజేశారు. దీంతో మహిళ కుటుంబీకులు వారికి కృతజ్ఞతలు తెలపడంతో పాటు పోయిన బంగారం దొరకడంతో ఎంతగానో ఆనందించారు.

ఎర్రగుట్ట గ్రామ తాగు నీటి సమస్యలు పరిష్కారిస్తాం

- ఐటీడీఏ పీఓ కుష్బు గుప్తా

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని ఎర్రగుట్ట పీవీటీజీ గ్రామంలో తాగునీటి సమస్యలను త్వరలో పరిష్కారిస్తామని ఐటీడీఏ పీఓ కుష్బు గుప్తా అన్నారు. గురువారం ఏఎంసీఓ జగనతో పాటు ఎస్వీఆర్పీ బలరాం గోవిందతో కలిసి గ్రామాన్ని సందర్శించారు. గ్రామానికి వెంటనే హ్యాండ్ పంపు, బోరును మంజూరు చేస్తామన్నారు. ఎలాంటి కష్టాలున్న నేరుగా ఐటీడీఏ కార్యాలయానికి వచ్చి సంప్రదించాలని సూచించారు.



3

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

కుమురంభీం ఆసిఫాబాద్

శుక్రవారం | మార్చి 29, 2024 | www.navatelangana.com

చెక్‌పోస్టును తనిఖీ చేసిన ఆసిఫాబాద్ డీఎస్పీ

నవతెలంగాణ-వాంకిడి



పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో గురువారం ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య ఎస్ఐ సాగర్‌తో కలిసి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇంటర్‌ఫేస్ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. వాహనాల రాకపోకలను పరిశీలించి వాహనాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. చెక్‌పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించి నగదు, మద్యం, గంజాయి, వరిధాన్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. చెక్‌పోస్టు సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా డబ్బుల తరలిస్తారని, అలా జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు.

ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-సిర్పూర్(టి)



మండలంలోని వేంపల్లి రైల్వేగేటు వద్ద నిర్మిస్తున్న రైల్వే ఓవర్‌బ్రిడ్జి వద్ద రైళ్లను ఆపి క్రేన్ల సహాయంతో గ్యాడర్ ఏర్పాటు చేస్తున్నారు. గురువారం ఆర్‌ఓబీ స్థలాన్ని ఎమ్మెల్యే హరీష్‌బాబు పరిశీలించారు. పనులు పురోగతిపై సికింద్రాబాద్ రైల్వే బీఆర్ఎం, డీఓఎల్‌తో ఫోన్ ద్వారా ఎమ్మెల్యే హరీష్‌బాబు వెంటనే రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులు పూర్తిచేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులు పూర్తవుతాయని, కాగజ్‌నగర్ నుండి సిర్పూర్ రహదారి బీటీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతాయని, అటవీ శాఖ అనుమతి కోసం కొంతమేర రహదారి నిర్మాణం పూర్తవడంలో జాప్యం జరుగుతుందని తెలిపారు. అది కూడా త్వరలోనే పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- ఎస్పీ సురేష్‌కుమార్



తుమ్మిహెట్టి వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ

నవతెలంగాణ-కౌటాల

విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని తుమ్మిహేటి వద్ద ఏర్పాటు చేసిన అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర నుండి డబ్బులు, మద్యం, నిషేధిత మద్యం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వస్తువులను తరలించిన వదలకూడదన్నారు. చెక్‌పోస్టు వద్ద రాత్రి, పగలు తేడా లేకుండా తనిఖీలు చేయాలన్నారు. తనిఖీల సమయంలో తప్పకుండా వీడియోగ్రాఫీ తీసుకోవాలన్నారు. రెవెన్యూ, ఫారెస్టు, ఎక్సైజ్ వారి సమన్వయంతో పోలీసులు విధులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడ అక్రమ దందాలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడుతాయని, రాబోయే పార్లమెంటు ఎన్నికలను శాంతియుత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. నేటి సమాజంలో యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం కౌటాల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. సిబ్బంది విధుల్లో ఎలాంటి అలసత్వం చూపకూడదన్నారు. ప్రతి ఒక్కరు తనవంతుగా బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ఆయన వెంట కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కౌటాల సీఐ సాదిక్‌పాషా, ఎస్ఐ మధూకర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



చెక్‌పోస్టు వద్ద వాహనాల వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ

ఆర్ఎంపీ వైద్యంపై విచారణ



నవతెలంగాణ-దహెగాం

మండల కేంద్రానికి గాదె నీలక్క ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా స్థానిక ఆర్ఎంపీ వైద్యుడు అనల లక్ష్మణ్ చేసిన వైద్యం వికటించి మృతిచెందినట్టు ఒక అపరిచిత వ్యక్తి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సీతారాం క్లీనిక్‌కు వెళ్లి విచారణ చేపట్టారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు స్పందన విచారణకు వెళ్లగా క్లీనిక్ మూసివేసి ఉండడం, ఆర్ఎంపీ వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో నేడు విచారణకు వచ్చినట్టు పేర్కొన్నారు. కాగా ఆర్ఎంపీ వైద్యుడు చనిపోయిన మహిళకు ఎలాంటి చికిత్స చేయలేదని రాతపూర్వకంగా రాసి ఇచ్చినట్టు తెలిపారు. అయితే ఆర్ఎంపీ వైద్యుడికి ప్రభుత్వం నుండి శిక్షణ తీసుకున్నట్టు సర్టిఫికేట్ లేదని, అలాగే ప్రాక్టీస్ నేర్చుకున్న సదరు ఆర్ఎంపీ ఆస్పత్రి వారు జారీ చేసిన సర్వీస్ సర్టిఫికేట్‌లో సైతం జారీ చేసిన తేదీ లేదని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట స్థానిక ప్రభుత్వ వైద్యురాలు స్పందన, వైద్యసిబ్బంది ఉన్నారు.

బహుజన ద్రోహి ఆర్ఎస్‌పీ గోబ్యాక్

- రాత్రికిరాత్రి వెలిసిన పోస్టర్లు


నవతెలంగాణ-కౌటాల

బహుజన ద్రోహి ఆర్ఎస్‌పీ అని మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండులో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు వ్యతిరేకంగా పోస్టర్లను అంటించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బహుజన ద్రోహి అని, ఆర్ఎస్‌పీ గోబ్యాక్ అంటూ పోస్టర్లు గురువారం వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్టాండులో దర్శనమిచ్చాయి. ఈ పోస్టర్ కనబడడంతో ప్రతి ఒక్కరు దానిని ఫోన్‌లో ఫోటోలో తీసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఆ పోస్టర్‌ను తీసివేయించారు. దీంతో బహుజన వాదుల్లో ఆర్ఎస్‌పీపై వ్యతిరేకత పెరిగిందనే పుకార్లు మండల వ్యాప్తంగా వినిపిస్తున్నాయి. బీఎస్పీలో చేరి సిర్పూర్ ఎమ్మెల్యేగా పోటీ చేశారు. గెలవకపోవడంతో బీఆర్ఎస్ పొత్తుకు పెట్టుకున బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. దీంతో బహుజనుల్లో ఆయనపై వ్యతిరేకత వచ్చిందని రాజకీయ విశ్లేకులు చెబుతున్నారు.



గిరి గ్రామానికేది రహదారి

- 75 ఏండ్లుగా అభివృద్ధికి దూరం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- కనిఖీ గ్రామానికి రావడానికి ఇబ్బందులే



ఎడ్లగూడ ప్రధాన రహదారి ఇదే

నవతెలంగాణ-కౌటాల

ప్రస్తుతం దేశం సాంకేతిక రంగంలో ఎంతో ముందుకు దూసుకెళ్తుంది. కానీ నేటి గిరి గ్రామాల పరిస్థితి మారడం లేదు. స్వాతంత్ర్యం వచ్చి సుమారుగా 75 వసంతాలు గడిచిన రహదారి లేని గ్రామాలు ఎన్నోఉన్నాయి. కౌటాల మండలంలోని కనిఖీ గ్రామ పంచాయతీలో గల ఎడ్లగూడకు వెళ్లడానికి సరైన రహదారి లేదు. అక్కడున్న వాళ్లంతా ఆదివాసులైనప్పటికీ ఐటీడీఏ సైతం ఆదరించడంలేదు. మండల కేంద్రానికి రావాలంటే సుమారుగా ఎనిమిది కిలోమీటర్ల దూరభారం పడుతుంది. కానీ ఎడ్లగూడ నుండి కనిఖీకి రావడానికి సరైన రహదారి లేక ఎండాకాలంలో ఏ చేన్ల నుండైనా వెళ్లడానికి ఇబ్బంది లేకపోయినా వర్షాకాలం, చలికాలంలో పొలాల్లో పంటలు ఉండడంతో ఇటు రావడానికి ఇబ్బందులు తప్పడంలేదు. కనీసం వర్షాకాలం ఎడ్ల బండినైనా కట్టుకొని రావాలంటే వెళ్లలేని పరిస్థితి ఉందని పలువురు ఎడ్లగూడ గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఎంతో మంది రాజకీయ నాయకులు ఓట్ల కోసం వచ్చి పోతుంటారు. ఎన్నికలప్పుడు మా సమస్యలను వారికి విన్నవిస్తే నేను గెలిచిన తర్వాత మీ ఊరికి రోడ్డు వేస్తానని హామీ ఇచ్చి ఎన్నికలైన తర్వాత మా గ్రామాన్ని పట్టించుకొనే నాథుడే కనబడడు. సుమారుగా ఎడ్లగూడ గ్రామంలో 30 కుటుంబాల వరకు జనాభా నివసిస్తుంటారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నప్పటీ నుండి నేతలకు మా మొర విన్నవించామని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైతే రహదారి సమస్య తప్పుతుందని ఎంతో ఆశగా ఎదురు చూసినప్పటికీ 10 సంవత్సరాలలో మా గ్రామానికి రూ.10 వేల పని కూడా చేయలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనైనా మా గ్రామానికి సరైన రహదారి ఏర్పాటవుతుందని ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఉపాధి పనులను తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని బెండారా గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రె గురువారం పరిశీలించారు. మండలంలోని బెండారా గ్రామ పంచాయతీలో జరుగుతున్న నీటి కుంటల నిర్మాణం, కాలువల పూడికతీత పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కూలీలు ఎక్కువ మొత్తంలో పనికి వచ్చి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఏప్రిల్ ఒకటి నుండి ఉపాధిహామీ కూలీల వేతనాలు రూ.300 పెంచడం జరిగిందన్నారు. కొలతల ప్రకారం పని చేయడంతో రోజుకు రూ.300 పొందే అవకాశం ఉంటుందన్నారు. పని ప్రదేశాల్లో గ్రామ పంచాయతీ నుండి నీటి సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం కూలీలు తాము వేతనాలు పొందడంలో పోస్టల్ శాఖ సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారని, ఖాతాలో డబ్బులున్న డబ్బులు ఇవ్వడంలేదని, కొంతమంది కూలీల ఖాతాలకు లాక్ పడగా ఇప్పటివరకు అన్‌లాక్ చేయడం లేదని కూలీలు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా కలెక్టర్ త్వరలోనే పోస్టల్ డిపార్టుమెంటుతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మండలంలోని ఎనగొంది, కొలాంగూడ గ్రామాలకు వచ్చిన సందర్భంగా గ్రామస్తులు భజాభజంత్రీలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కొలాంగూడ గ్రామంలో తాగునీటి సౌకర్యం లేదని, ఐదు సంవత్సరాల క్రింత మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు నిర్మించిన నీటి సరఫరా కావడంలేదని గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించగా మిషన్ భగీరథ ఈఈ వెంకట్‌రావ్, జేఈ శైలేందర్‌ను పిలిపించి సమస్యను గురించి అడిగి తెలుసుకున్నారు. ఇలా కావడానికి కారణాలను అడిగి తెలుసుకోగా రెండు రోజుల్లో సమస్యలు లేకుండా నీటి సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. వీటితో పాటు గ్రామంలో కరెంటు సమస్య ఉందని తెలపడంతో కరెంటు సమస్యను కూడా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఆయనతో పాటు అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, తహసీల్దార్ రోహిత్, ఏపీఓ, ఎంపీఓ, ఈసీ, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులున్నారు.



ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దాత్రె



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

లక్ష్యాలు నిర్ణీత కాలంలో పూర్తి చేయాలి

- వేసవిలో తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలి
- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

శాఖల వారీగా అధికారులకు నిర్దేశించిన లక్ష్యాలు నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని అలాగే రానున్న వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా సమన్వయంతో అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. తాగునీటితో పాటు పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిపుణుల అభిప్రాయాల మేరకు వచ్చే వేసవిలో ఎండలు ఎక్కువగా ఉంటే అవకాశం ఉందని ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. మిషన్ భగీరథ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా తిరుగుతూ ఏమైనా లీకేజీలు ఉన్న గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ మరమ్మతులు చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అవసరమైన చోట బోర్లు వేయాలన్నారు. నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్నచోట ట్యాంకర్లతో ప్రజలకు నీరు సరఫరా చేయాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. మార్చి 31లోపు గ్రామపంచాయతీల్లో 100శాతం ఇంటి పన్ను వసూలు చేయాలన్నారు. ఉపాధి కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కూలీల హాజరు శాతం 100శాతం ఉండేల చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో అంతర్గత రహదారుల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. నిర్ణీత సమయంలో నిర్దేశించిన లక్ష్యాలు అందుకునేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ లోకేశ్వరరావు డిఆర్డిఏ సురేందర్, డిఎల్పీఓ ఉమర్ హుస్సేన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రంలో జాగ్రత్తగా ఉండాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

సిర్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మారుమూల సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది జాగ్రత్తగా ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. గురువారం సిర్పూర్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మారుమూల సమస్యాత్మక జిల్లా పరిషత్ పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సెక్టర్ అధికారులు తీసుకోవాల్సిన చర్యల గురించి పోలింగ్ కేంద్రాల్లో రోడ్డు, నీటి సదుపాయం, ఇతర సదుపాయాల గురించి ప్రజలను అడిగి తెలుసుకోవాలన్నారు. ప్రతి ఒక్కర తమ ఓటు హక్కును ప్రజాస్వామ్య బద్ధంగా వినియోగించుకొని మెరుగైన సమాజాన్ని నిర్మించడంలో తమ పాత్ర పోషించాలని, ప్రజల్లో ఎన్నికల పట్ల విశ్వాసాన్ని పెంపొందించే దిశగా సమావేశాలు నిర్వహించాలని, యువత, ప్రజలు మావోయిస్టుల ప్రలోభాలకు లోను కావద్దని, వారికి సహకరించొద్దని పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తుల మాయమాటలు నమ్మవద్దని, పోలీసులు ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి సహకరిస్తారని తెలియజేశారు. అపరిచిత వ్యక్తుల సమాచారం తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలన్నారు. ఆయన వెంట కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కౌటాల సీఐ సాదిక్‌పాషా, ఎస్ఐ దీకొండ రమేష్, ఇతర సిబ్బంది ఉన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న ఎస్పీ సురేష్‌కుమార్

బహుజనవాదం, తెలంగాణవాదం కలిశాయి

- చేరికపై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వ్యాఖ్య
- బీఆర్ఎస్‌లో చేరినా జీవితాంతం బహుజనవాదం వైపే
- పొత్తు కుదరకపోవడంతోనే బీఆర్ఎస్‌లో చేరానని వెల్లడి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తాను బీఆర్ఎస్‌లో చేరి బహుజనులను మోసం చేశానని ప్రచారం చేస్తున్నారని, ఇది బహుజనులు ఎట్టి పరిస్థితులలో నమ్మవద్దని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం కాగజ్‌నగర్‌లోని సంతోష్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సిర్పూరు నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ మంత్రి జోగు రామన్న, ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌పీ మాట్లాడుతూ ప్రస్తుతం బహుజనవాదం, తెలంగాణవాదం కలిశాయని వ్యాఖ్యానించారు. తాను బీఆర్ఎస్‌లో చేరినా జీవితాంతం బహుజనవాదం వైపే నిలుస్తానని స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణవాదం, బహుజనవాదంపై దాడి చేస్తున్న కారణంగా లోక్‌సభ ఎన్నికలలో బీఆర్ఎస్‌తో పొత్తు కోసం కేసీఆర్‌తో చర్చలు జరిపినట్లు తెలిపారు. ఇది మాయావతి అనుమతితోనే చేశానని పేర్కొన్నారు. కాని ఈ పొత్తును కూడా బీజేపీ, కాంగ్రెస్‌లు చెడగొట్టడంతో తాను బీఎస్పీని వీడి బీఆర్ఎస్‌లో చేరినట్లు వివరించారు. అప్పటికే అధికారం కోసం వెంపర్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప దీనిని సాకుగా చూపి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరాడని విమర్శించారు. పదేండ్లుగా కేసీఆర్ దయతో ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గంలో దో నెంబర్ దందాలతో కోట్లు గడించాడని ఆరోపించారు. నియోజకవర్గంలో కోనప్ప చేసే బియ్యం, మట్కా, భూ దందాలు కొనసాగాలంటే అధికార పార్టీ అవసరం ఉంటుందన్నారు. 17 ఎంపీ స్థానాలకు గాను బీఆర్ఎస్ 11 స్థానాలకు బహుజనులను అభ్యర్థులుగా నిలిపిందని, ఏ పార్టీ అయినా ఈ సాహసం చేసిందా అని ప్రశ్నించారు. మాలీ కులస్థులకు ఎస్సీ హోదా, ఆరె కులస్థులకు ఓబీసీ హోదా కల్పించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. వీటి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మాణం చేసి కూడా కేంద్రానికి పంపిందని గుర్తుచేశారు. ఆదివాసీల ఆత్మగౌరవం, లౌకికవాదం, రాజ్యాంగాన్ని రక్షించుకోవాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులు గెలవాల్సిన అవసరం ఉందని, ఆదిలాబాద్ ఎంపీగా ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు.

నాపై కోపం వీడండి : బీఎస్పీ శ్రేణులకు ఆర్ఎస్పి విజ్ఞప్తి

'నేను బీఆర్ఎస్‌లో చేరడంతో కొంతమంది నా అనుచరులు నియోజకవర్గంలో నాపై కోపంతో ఉన్నట్లు తెలిసింది. వారందరిని కలుస్తా, కోపం తగ్గించుకొని తనతో కలిసి రావాలని కోరుతా'నని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో కేవలం మూడు నెలలు ఇక్కడ ఉంటే ప్రజలు నన్ను నమ్మి 44 వేల పైచిలుకు ఓట్లు వేసి ఆదరించారని, వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. నా కోసం కష్టపడ్డ ప్రతీ నాయకుడు, కార్యకర్తను కలిసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపుకు కృషి చేయాలని కోరనున్నట్లు పేర్కొన్నారు. దీనికి ముందు ఎమ్మెల్సీ దండె విఠల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాజీ మంత్రి జోగు రామన్న, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు బీఎస్పీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పారు. ఈ సమావేశంలో బీఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షులు లెండెగురె శ్యాంరావు, బెజ్జూరు జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, కౌన్సిలర్ మినాజ్, నాయకులు సీపీ రాజ్‌కుమార్, అబ్దుల్‌కలాం, శరత్ పాల్గొన్నారు.



మిగిలిన సీట్లకు దరఖాస్తుల గడువు పెంపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ సాంఘిక సంక్షేమ, గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు గడువును ఈ నెల 30 వరకు పెంచినట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ ఉటూరి శ్రీనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని ఇతర వివరాలకు విద్యార్థుల తల్లిదండ్రులు సాంఘిక సంక్షేమ, గురుకుల పాఠశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఐచర్‌వ్యాన్ ఢీ కొని ఒకరు మృతి

నవతెలంగాణ-వాంకిడి

ఐచర్‌వ్యాన్ ఢీ కొని ఒకరు మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి మండల కేంద్రంలో జరిగింది. గురువారం ఎస్ఐ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన జాబుజి ప్రభాకర్(66) కార్పెంటర్ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం ఐదు గంటలకు కార్పెంటర్ పని నిమిత్తం లక్ష్మీనగర్ కాలనీకి వెళ్లి పని ముగించుకొని తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో మహారాష్ట్ర నుండి హైదరాబాద్‌కు పశువుల లోడ్‌తో వస్తున్న ఐచర్‌వ్యాన్ అతివేగంగా వచ్చి నడుచుకుంటూ వెళ్తున్న ప్రభాకర్‌ను వెనుక నుండి ఢీ కొట్టింది. ప్రభాకర్ క్రింద పడిపోగా అతని మీది నుండి వ్యాన్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందినట్టు ఎస్ఐ పేర్కొన్నారు. డ్రైవర్ వ్యాన్‌ను అతివేగంగా నడపడంతోనే ప్రమాదం జరిగిందని ఎస్ఐ తెలిపారు. ఇది గమనించిన పోలీసులు అంబులెన్స్‌లో ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సత్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నవతెలంగాణ

మంచిర్యాల

4

శుక్రవారం | మార్చి 29, 2024 | www.navatelangana.com

హీరో సుమన్ చేతుల మీదుగా హెల్మెట్ల పంపిణీ

నవతెలంగాణ-జైపూర్



అంజనీ పుత్ర రియల్ ఎస్టేట్ మేనేజింగ్ డైరెక్టర్ గుర్రాల శ్రీధర్ పుట్టిన రోజును పురస్కరించుకుని సినిమా హీరో సుమన్ చేతుల మీదుగా మంచిర్యాల పట్టణంలో హెల్మెట్లు పంపిణీ చేశారు. గురువారం మంచిర్యాల పట్టణానికి వచ్చిన హీరో సుమన్‌ను కలిసిన జైపూర్ మండలం నర్వ గ్రామానికి చెందిన జిల్లా నేతకాని సంఘం అధ్యక్షుడు పొట్టాల నాగరాజు పలువురికి హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్మెట్ అవస్యకతను వివరిస్తూ అది లేకుండా ప్రయాణించి ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు

నవతెలంగాణ-నస్పూర్



నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. శ్రీరాంపూర్ బస్టాండ్ ఏరియాలోని మద్యం దుకాణాలు రాత్రి 10 గంటలకు మూసివేయాలని నిబంధన ఉన్నా కూడ బేఖాతారు చేస్తున్నారు. దీంతో రాత్రి 10 గంటల తర్వాత కూడా మద్యం విచ్చలవిడిగా దొరుకుతోంది. ఇదిలా ఉండగా సంబంధిత అధికారులు సైతం పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బోరుబావులతో తాగు నీటి సమస్యకు పరిష్కారం



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతి పరిధిలో నీటి ఎద్దడిని గుర్తించిన వివిధ వార్డుల్లో బోరు బావులు ఏర్పాటు చేసి తాగు నీటి సమస్యకు పరిష్కారం చూపించామని శివ్వారం గ్రామ పంచాయతి తాజా మాజీ సర్పంచ్ ఆవిడపు గణేష్ తెలిపారు. ఎంపీ ల్యాడ్ నిధులు రూ. 4 లక్షలు, ఎమ్మెల్యే ప్రత్యేక నిధులు రూ. 4 లక్షలతో 4వ వార్డు పద్మశాలి వాడ, 6 వార్డు కాపు వాడ, 8వ వార్డు ఎస్సీ న్యూ కాలనీలో మరో రెండు బోర్లు వేసినట్లు తెలిపారు. వార్డు ప్రజల సౌకర్యార్థం కొత్తగా వేసిన బోరు బావులకు విద్యుత్ మోటార్లు బిగించి నీటి సరఫరా ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. గ్రామ పంచాయతి ప్రజల అవసరాల మేరకు తాగు నీటి ఇబ్బందులు వివరించిన వెంటనే స్పందించిన ఎంపీ, ఎమ్మెల్యేలకు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్యం మేరకు ఉత్పత్తి సాధించాలి



నవతెలంగాణ-మందమర్రి

లక్ష్యం మేరకు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని సింగరేణి ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు. గురువారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఏ మనోహర్‌తో కలిసి కేకే ఓపెన్ కాస్ట్ గనిని సందర్శించారు. అనంతరం గని ప్లాన్లను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఓబీ ఎంత ఎక్కువ తీస్తే బొగ్గు అంత ఎక్కువ రవాణా చేయడానికి అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కేకే ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్, డివై ఎస్ఎస్ఓ ప్రకాష్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను కూల్చివేసిన అధికారులు



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలో ఇలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన వాటిని డీటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం కూల్చివేశారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-6 కొత్త రోడ్‌లో రెండు అక్రమ షెడ్లను, సర్వేనెంబర్ నెం.24 శివాలలో 4 సెట్ బ్యాక్ అక్రమ నిర్మాణాలను, సర్వే నెం.42 నస్పూర్ గ్రామంలో 1, సర్వే నెం.11 లోని సరిహద్దు రాళ్లను అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో ఎటువంటి అక్రమ నిర్మాణం చేపట్టరాదని, ఎవరైనా ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం చేపడితే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ టీపీఎస్ సతీష్, నస్పూర్ ఎస్ఐ రవికుమార్, శ్రీరాంపూర్ ఎస్ఐ లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

ఘనంగా అంజనీపుత్ర సంస్థ చైర్మన్ జన్మదినం



నవతెలంగాణ-మందమర్రి

అంజనీ పుత్రసంస్థ చైర్మెన్ గుర్రాల శ్రీధర్ పుట్టిన రోజు వేడుకలను ఏసీసీ శ్రీనివాస గార్డెన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. అంజనీ పుత్ర సంస్థ ఎండీ పిల్లి రవి నేతృత్వంలో 3 వేల మందితో రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథితులుగా పాల్గొన్న మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య మాట్లాడుతూ స్వయం కృషి, మంచి వ్యక్తిత్వం కలిగి ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా నమ్మకమైన సేవలందిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం సంతోషకరమైన విషయం అన్నారు. అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్న శ్రీధర్ సేవలు సమాజానికి ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో అంజనీ పుత్ర సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు సంతోష్, కిషన్, ఏజెంట్స్, కస్టమర్‌లు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్



ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల్లో మాట్లాడుతున్న రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్

నవతెలంగాణ-నస్పూర్

నూతనంగా ఏర్పడిన మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, తిరుపతి అధ్యక్షతన మంచిర్యాల జిల్లా 4వ మహాసభ మల్లు స్వరాజ్యంనగర్ అభిమన్యు ప్రాంగణంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దామెర కిరణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిందని, గత ప్రభుత్వం విద్యారంగాన్ని గాలికొదిలేసిందని, గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ విద్యా రంగం తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టబడిందని అన్నారు. రూ. 7200 కోట్ల పైచిలుకు పెండింగ్ స్కాలర్షిప్స్, రియంబర్స్మెంట్ బకాయిలు ఉన్నాయని, గత తొమ్మిది నెలలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల్లో డైట్ బిల్లులు లేవని, సంక్షేమ హాస్టల్లో చదువుకునే విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడంలో అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయని ఆరోపించారు. అనేక విద్యా కేంద్రాల్లో ఫుడ్ పాయిజన్లు, మౌలిక వసతుల కొరత కారణంగా గురుకులాల్లో విద్యార్థుల ఆత్మహత్యలు సంభవిస్తున్నాయని మండిపడ్డారు. మెస్, కాస్మోటిక్ చార్జీల పెంపు ప్రతిపాదనలు పేపర్ ప్రకటనలకే పరిమితం అవుతున్నాయని, గత ప్రభుత్వంలో ఎలాంటి హామీలను కూడా అమలు చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి 11,000 పైచిలుకు ఉద్యోగాలకు మెగా డీఎస్సీ విడుదల చేసిందని, దీనికి ఎటువంటి న్యాయపరమైన ఆటంకాలు రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. కేజీబీవీలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో తీవ్రమైన సమస్యలు ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న సంక్షేమ వసతి గృహాలకు నూతన భవనాలు నిర్మించేందుకు బడ్జెట్ సమావేశాల్లో నిధులు కేటాయించిందని, సొంత భవనాలు వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దుంపల కుమార్, వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు పైలా ఆశయ్య, జిల్లా కమిటి సభ్యులు ఈదూనూరి అభినవ్, ఎస్ఎఫ్ఐ చెన్నూర్ డివిజన్ కార్యదర్శి నాగరాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకె రవి, గాయత్రి, సానియా, యాసీన్ పాల్గొన్నారు.

సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్



5కే రన్‌ను ప్రారంభింస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

లోక్‌సభ ఎన్నికల్లో అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కుతో సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం వరకు చేపట్టిన 5కే రన్‌ను ప్రారంభించారు. ఈ ర్యాలీలో అదనపు కలెక్టర్లు బి.రాహుల్, సబావత్ మోతిలాల్, డీసీపీ అశోక్ కుమార్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోని ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హకును తప్పక వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికలలో పోలింగ్ శాతం తక్కువగా నమోదయ్యే ప్రాంతాలను గుర్తించి పోలింగ్ శాతాన్ని పెంపొందించే విధంగా కళాజాత, ఇంటింటి తిరుగుతూ, విస్తృత ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యపర్చడం జరుగుతుందని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు వారి పరిధిలో సిబ్బందితో కలిసి ప్రచారం నిర్వహించాలన్నారు. లోక్‌సభ ఎన్నికలు-2024లో భాగంగా మే 13వ తేదీన జరుగనున్న పోలింగ్‌లో వయస్సు అర్హత ఉండి ఓటరు జాబితాలో పేరు గల ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఏప్రిల్ 1, 2024 తేదీని ప్రామాణికంగా తీసుకొని 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరు ఏప్రిల్ 15వ తేదీ లోగా తమ వివరాలు నమోదు చేసుకొని నూతన ఓటరు కార్డు పొందాలని తెలిపారు. జిల్లాలో దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్లను ఓటు వేసేలా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి కుల, మత, వర్గ, ప్రాంతాల వివక్ష లేకుండా, ప్రలోభాలకు గురి కాకుండా పోలింగ్ రోజున నిష్పక్షపాతంగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు, జిల్లా అధికారులు, యువతీ, యువకులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలి

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

నవతెలంగాణ-మందమర్రి





ఎన్నికల సంఘం నియమ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. గురువారం సీఈఆర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మందమర్రి, రామకృష్ణాపూర్‌కు చెందిన రాజకీయ పార్టీల నాయకులు కార్యకర్తలతో బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రవికుమార్ మాట్లాడుతూ రానున్న లోక్ సభ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీల వారు పోలీస్ వారికి సహకరించాలని, ఎన్నికల సంఘం నియమ నిబంధనలు పాటించి శాంతి పూర్వక వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని కోరారు. అనవసరంగా సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టి పార్టీల మధ్య గొడవలు పెట్టే వారి పైన కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. మందమర్రి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో మందమర్రి, రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన కొన్ని సంఘటనలు ఉదాహరిస్తూ, మళ్లీ అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా సహకరించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎన్నికల ప్రచారంలో అనుమతి తీసుకోనుట, సువిధ, సి విజిల్, 1950 టోల్ ఫ్రీ నెంబర్ల ప్రాముఖ్యతను వివరించారు. తహసీల్దార్ చంద్రశేఖర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మందమర్రి ఎస్ఐ రాజశేఖర్, రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా రామస్వామి

నవతెలంగాణ-నస్పూర్



జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా గరిసే రామస్వామిని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్ తెలిపారు. గురువారం మంచిర్యాలలోని అంబేద్కర్ భవనంలో నూతనంగా అధ్యక్షునిగా ఎన్నికైన రామస్వామికి జిల్లా అధ్యక్షుడు, జై భీమ్ సైనిక్ దళ్ రాష్ట్ర కన్వీనర్ పురుషోత్తం, జాతీయ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలితపు శంకర్, ప్రచార కార్యదర్శి కనకరాజు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామస్వామి గతంలో విద్యార్థి యువజన ప్రజా పోరాటాలలో జిల్లా స్థాయిలో అంబేద్కర్ కోల్ బెల్ట్ ఏరియా ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన అనుభవం గుర్తించి జాతీయ మాల మహానాడు నిర్మాణానికి వారి సేవలను తోడ్పాటు అందిస్తారని నియమించినట్లు తెలిపారు. అలాగే రామస్వామి నియామకం పట్ల జిల్లా మాలలు హర్షం వ్యక్తం చేశారు. మంచిర్యాల పట్టణ గోపాలవాడకు చెందిన నీరిటి నర్సయ్యను మంచిర్యాల పట్టణ ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నక్క శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జె నర్సింగ్, కుమారస్వామి జిల్లా ప్రధాన కార్యదర్శి సొల్లు శ్రీనివాస్, జై భీమ్ సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల నరేష్, వివిధ మండలాల అధ్యక్షులు సురిమిల్ల వెంకటేష్, దాసరి ప్రకాశ్, లింగయ్య, భోగ రాజన్న పాల్గొన్నారు.

సింగరేణి యాజమాన్యం అయోమయానికి గురిచేస్తోంది

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి యాజమాన్యం కార్మికులను అయోమయానికి గురి చేస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీసైదా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022-23 సంవత్సరానికి సంబంధించిన క్యాటగిరి ప్రమోషన్లను 2023 సెప్టెంబర్ నాటికి ఇవ్వాల్సి ఉండగా గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ డిమాండ్ మేరకు కేటగిరి ప్రమోషన్లు ఇచ్చేందుకు యాజమాన్యం లెటర్లను సిద్ధం చేసిందన్నారు. కానీ కొన్ని యూనియన్లకు సంబంధించిన రాజకీయ ప్రమేయంతో వాటిని ఆపడానికి యాజమాన్యం చూస్తుందని కార్మికులకు సంబంధించిన ప్రమోషన్ లెటర్లు ఇచ్చేందుకు గనుల పైకి పంపించిన ప్రమోషన్ లెటర్లను తిరిగి తీసుకుందని, దీనివల్ల కార్మికులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. కొన్ని యూనియన్ల రాజకీయ జోక్యానికి యాజమాన్యం అడుగులకు మడుగులు ఒత్తుతూ ఎన్నికల కోడ్ పేరుతో ప్రమోషన్లను ఆపుతున్నారని, కార్మికులకు ప్రతి సంవత్సరం రావాల్సిన ప్రమోషన్లకు ఎన్నికలకు సంబంధం ఏంటని వారు యాజమాన్యాన్ని ప్రశ్నించారు. 2023-24 సంవత్సరానికి కార్మికులకు రావాల్సిన కేటగిరి ప్రమోషన్లు రాకపోవడం వల్ల తీవ్రమైన నష్టం జరుగుతుందని, 2024 మార్చి నాటికి చెల్లించవలసిన ఇంక్రిమెంట్ కూడా జాప్యం జరుగుతుందని అన్నారు. యాజమాన్యం కార్మికులకు ఇవ్వవలసిన ప్రమోషన్ లెటర్లను వెంటనే ఇవ్వకపోతే గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని యాజమాన్యాన్ని హెచ్చరించారు.

గురుకుల పాఠశాలలో బ్యాక్‌లాక్ సీట్ల కోసం దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల 2024-25 సంవత్సరానికి గాను 6,7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న బ్యాక్ లాక్ సీట్ల కొరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పట్టణ తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.ప్రేమరాణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21వ తేదీన ఉదయం 11 గంటల నుండి ఒంటిగంట వరకు జరుగుతుందని, మరిన్ని వివరాలకు దగ్గరలో ఉన్న గురుకుల పాఠశాలలో సంప్రదించాలని తెలిపారు.


వృద్ధాశ్రమానికి చిన్నారుల విరాళాల సేకరణ



నవతెలంగాణ-జన్నారం

మంచిర్యాలలోని శ్రీ సాయి వృద్ధాశ్రమం కోసం మండలంలోని కలమడుగు గ్రామంలో ఉన్న వివేకానంద పాఠశాలకు చెందిన చిన్నారులు గురువారం విరాళాలు సేకరించారు. విరాళాల ద్వారా రు.7355 సేకరించి ఆశ్రమం ప్రతినిధి వాసుకి అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమం ప్రతినిధి వాసు మాట్లాడుతూ వృద్ధుల కోసం చిన్నారులు, విరాళాలు సేకరించడం, వారి గొప్పతనానికి నిదర్శనం అన్నారు. చిన్నతనం నుంచే వివేకానంద పాఠశాల చిన్నారులకు, సమాజ సేవ నేర్పించడం గొప్పవిషయం అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ అమరగుండా సతీష్‌గౌడ్, ఇన్‌చార్జి తిరుపతి పాల్గొన్నారు.

లక్షెట్టిపేట బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-లక్షెటిపేట

లక్షెట్టిపేట మండల కేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్ట్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి గోవిందరావు తెలిపారు. గురువారం రోజున స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించిన ఎన్నికలల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గడికొప్పుల కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా నేరెళ్ల రాజేశ్వర్ ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ న్యాయవాదుల హక్కుల కోసం పోరాడుతూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తోటి న్యాయవాదులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదివితేనే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు

నవతెలంగాణ-జన్నారం

విద్యార్థులు క్రమశిక్షణతో చదివితేనే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని, ఏఆర్ఎస్, వికాస్ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్ ముత్యం సతీష్ అన్నారు. ఆర్ఆర్‌గార్డెన్‌లో, ఆ కళాశాలల, వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు, తమ ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, ముత్యం సతీష్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు కష్టపడి చదివి, కళాశాలకు గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

పెండ్లికి రూ.10వేల ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



పేద కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు అండగా నిలిచి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండలంలో మాలేబోరిగాంలో నివాసం ఉంటున్న జంగుబాయి ఇంట్లో 5వ తేదీన వివాహం ఉండడంతో కుమ్ర రాజు, గేడం రాము కలిసి పెండ్లి ఖర్చుల నిమిత్తం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. వారికి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

డీఎస్పీ ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ-దిలావర్‌పూర్



మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం డీఎస్పీ గంగారెడ్డి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో ఉన్న దస్త్రాలను ఆయన పరిశీలించారు. బాధితులు 100కు ఫోన్ చేస్తే సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలని, వారికి తగిన న్యాయం చేయాలని సూచించారు. రాబోయే ఎంపీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.

ఏఎస్ఐగా ఉద్యోగొన్నతి పొందిన ఎజాజ్‌కు సన్మానం



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వరిస్తున్న ఎజాజ్ ఏఎస్ఐగా పదోన్నతి పొంది సీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎస్ఐ శ్రీధర్, అదనపు ఎస్ఐ నాగరాజు శాలువాతో సన్మానించారు. పదోన్నతితో పాటు పదవీ బాధ్యతలు పెరుగుతున్నందున శాంతి బద్రతల పరిరక్షణలో ప్రజలకు మరింతగా సేవలందించాలని, శాఖ పరంగా ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగోన్నతులు పొందాలని ఆకాంక్షించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

- సింగరేణి సీఎండీతో సమావేశమైన ఐఎన్‌టీయూసీ నాయకులు

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి గని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు కోరారు. గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సింగరేణి సీఎండీ బలరామ్‌తో సమావేశమైన ఐఎన్‌టీయూసీ నాయకులు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా సొంతింటి కల, పెర్క్స్ మీద ఇన్‌కమ్ రద్దు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుపై దృష్టి పెట్టాలని కోరారు. అదేవిధంగా కొత్తగా భూగర్భ కొత్త గనులు ఏర్పాటు చేసి సింగరేణి వ్యాప్తంగా ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. ఈ ఆఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి లక్ష్యాలను సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధి హామీ, కూలీలకు దినసరి కూలి పెంచాలి



నవతెలంగాణ-జన్నారం

జాతీయ ఉపాధి హామీ కూలీలకు దినసరి కూలి పెంచాలని సీపీఐ మండల కన్వీనర్, మామిడి విజయ్ అన్నారు. గురువారం మండలంలోని, పలు గ్రామాల్లో చేస్తున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలు పనిచేస్తున్న స్థలాల్లో విశ్రాంతి సమయంలో నీడ, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగినందున దినసరి కూలి పెంచాలని డిమాండ్ చేశారు.

ఆదర్శ పాఠశాలలో ఘనంగా గణిత రంగోళి



నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి ఆదర్శ పాఠశాలలో గణిత రంగోళిని ఘనంగా నిర్వహించారు. గురువారం మందమర్రి ఆదర్శ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు అమీర్ పాషా ఆధ్వర్యంలో 6 నుండి 9వ తరగతి విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని గణిత సూత్రాలు, గుర్తులతో అద్భుతమైన రంగోళి ఏర్పాటు చేశారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ జయకృష్ణ రెడ్డి, ఉపాధ్యాయ బృందం విజేతలను ఎంపిక చేసి అభినందనలు తెలిపారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగివున్న ప్రతి ఒక్కరు ఎన్నికల్లో పాల్గొని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు కోరారు. గురువారం మండల కేంద్రంలో పోలీస్ సిబ్బందితో కలిసి జాతీయ రహదారి 363 మీదుగా ఆవుడం ఎక్స్ రోడ్డు నుంచి బస్టాండ్ వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరాపూర్ సీఐ మోహన్, స్థానిక ఎస్ఐ రాములు, జైపూర్ ఎస్ఐ శ్రీధర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. జైపూర్ మండల కేంద్రంలో కూడా పోలీస్ కవాతు నిర్వహించారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్‌నాయక్



నవతెలంగాణ-జన్నారం

మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలు, వడగళ్ల వానకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఖానాపూర్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పంట దెబ్బతిన్న రైతులకు మనోధైర్యాన్ని ఇచ్చారు. పంట నష్టపోయిన పంటలను సర్వే చేసి ప్రతి ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆరు కాలం కష్టపడిన రైతులు పంట చేతికి వచ్చే దశలో, అకాల వర్షాలకు నేలపాలవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. అసలే అరాకొర పండుతున్న పంటలకు, ఇలా ప్రకృతి పగ పట్టడం, రైతులకు ఎంతో నష్టదాయకమన్నారు. ఉన్న పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు. గ్రామంలో అకాల వర్షాలకు దాదాపు 70 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.15000 ఇస్తానని చెప్పి కనీసం గత ప్రభుత్వం ఇచ్చిన రూ.10,000 కూడా ఇవ్వడం లేదన్నారు. ఎన్నికల ముందు మేనిఫెస్టోలో రైతులకు రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తానని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు రుణమాఫీ చేయకపోవడం దారుణం అన్నారు. 6 గ్యారంటీ స్కీంలలో ఏ ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఎకరాకు కాలువల ద్వారా నీరు అందించి రైతుల పంట పొలాలు ఎండకుండా చూసామన్నారు. 24 గంటల విద్యుత్ అందించి రైతులు పంట పొలాలను కాపాడామన్నారు. ప్రస్తుతం విద్యుత్ సక్రమంగా లేక రైతుల మోటర్లు కాలిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో జన్నారం జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, మండల కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, జిల్లా అధికార ప్రతినిధి సిటీమల భరత్ కుమార్, జిల్లా నాయకులు, ఫజల్ ఖాన్, తాళ్లపల్లి రాజేశ్వర్, తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ జాడి గంగాధర్ పాల్గొన్నారు.

చోరీ కేసులో ఏడాది జైలు

నవతెలంగాణ-నస్పూర్

చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తు గురువారం మంచిర్యాల్ మొదటి అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఉపనిషద్వని తిర్పునిచ్చారు. తీగల్ పహాడ్‌కు చెందిన రాజవరపు వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2023 సంవత్సరంలో దొంగతనానికి పాల్పడ్డారు. బాధితుల పిర్యాదు మెరకు ఎస్ఐ రవి కుమార్ కేసు నమోదు చేశారు. గురువారం మంచిర్యాల కోర్టులో నస్పూర్ కోర్టు కానిస్టేబుల్ నాగరాజు ద్వారా పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాహీన్ సుల్తానా సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు అయింది. దింతో న్యాయమూర్తి జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

వికసించిన వైద్య కుసుమాలు..!

- చింతావార్ కుటుంబంలో నలుగురు వైద్యులు

వారిది వ్యాపార కుటుంబం. తాతముత్తాతల కాలం నుంచి వ్యాపారంలో రాణిస్తున్న ఆ కుటుంబం అంటే జిల్లాలో తెలియని వారు లేరు. కుటుంబ పెద్దలు వ్యాపారంలో రాణిస్తుంటే.. వారి పిల్లల అభిరుచి మాత్రం వ్యాపారం వైపు కాకుండా వైద్య వృత్తిపైకి మళ్లింది. ఒకే కుటుంబం నుంచి ఏకంగా నలుగురు వైద్యులుగా రాణిస్తున్నారు. నార్నూర్ మండలం తాడిహత్నూర్‌కు చెందిన చింతావార్ కుటుంబంపై ప్రత్యేక కథనం..

నవతెలంగాణ-నార్నూర్

అదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలో చింతావార్ పరివారం అంటే తెలియని వారు ఉండరు. ఆ కుటుంబంలో ఉన్న వారంతా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రముఖ వ్యాపారాల్లో ముందుకు సాగుతున్నారు. ముందుగా మండల కేంద్రంలో చింతవార్ హన్మండ్లు,చింతావార్ దిగాంబర్,అదేవిధంగా మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో చింతావార్ రాములు ముగ్గురు అన్నదమ్ములు ఇక్కడ స్థిరపడి వ్యాపారం సాగించారు.వ్యాపారంలో నిష్ణాతులైన చింతావార్ రాజ్ కుమార్,చింతావార్ గోవింద్,చింతావార్ చంద్రశేఖర్,చింతావార్ శ్రీనివాస్ జిల్లాలో ప్రముఖ వ్యాపారాల్లో స్థిర పడ్డారు.వ్యాపారంలో నిష్ణాతులైన వారి కుటుంబంలో కొత్తతరం వారు మాత్రం వ్యాపారం వైపు కాకుండా చదువు వైపు దృష్టి మళ్లించారు.ప్రస్తుతం ఆ కుటుంబంలో ఏకంగా నలుగురు డాక్టర్లు అయ్యారంటే ఆశ్చర్యపోక తప్పదు. వీరే వైద్యులు చింతావార్ రాజ్ కుమార్ కుమారుడైన చింతావార్ అన్మోల్ కామినేని మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేసి అర్థోపెడిక్ వైద్యునిగా రాణిస్తున్నారు. రాజ్ కుమార్ సోదరుడైన చింతా వార్ చంద్రశేఖర్ కుమారుడు చింతావార్ అభిరామ్ ఫిలిపిన్స్‌లో ఎంబిబిఎస్ పూర్తి చేశాడు.చింతావార్ శ్రీనివాస్ కుమార్తె చింతావార్ అషితా వరంగల్ లోని కాకతీయ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ లో మొదటి స్థానంలో ఉత్తీర్ణులయ్యారు. అదేవిధంగా చింతావార్ గోవింద్ రావ్ కుమార్తె చింతావార్ ప్రేరణ కరీంనగర్ లోని ప్రతిమ మెడికల్ కళాశాలలో తాజాగా ఎంబీబీఎస్ చదువుతున్నారు.ఇలా కష్టపడి చదివి ఒకే కుటుంబంలో నలుగు వైద్యరంగంలో సీటు సాధించడంతో మండల ప్రజలు విశేషంగా భావిస్తున్నారు.



డా. అన్‌మోల్



డా.అభిరాం



డా. అషిత



ప్రేరణ

ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్
- వరి గ్రేడ్-ఏ రకానికి రూ.2203
- గ్రేడ్-బీ రకానికి రూ.2183
- ఏప్రిల్ 1న మండలానికి ఒక కొనుగోలు కేంద్రం ప్రారంభం
- ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలి
- అధికారులతో సమీక్షలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



నవతెలంగాణ - సిరిసిల్ల

జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సజావుగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. రబీ సీజన్ (2023-24) ధాన్యం కొనుగోళ్లపై జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. లోక్ సభ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలను అధికారులు, ఆయా శాఖల బాధ్యులు మాత్రమే ప్రారంభించాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా టెంట్లు, తాగు నీరు, విద్యుత్ వసతి కల్పించాలని, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలని, నిర్దేశించిన విధంగా కొనుగోళ్ల చేయాలని సూచించారు. నిర్దేశించిన బరువుకంటే ఎక్కువ ఎట్టి పరిస్థితుల్లోనూ చేయవద్దని ఆయన స్పష్టం చేశారు.

మద్దతు ధరకే విక్రయించాలి

రైతులు తాము కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పిలుపు నిచ్చారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని,నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూకేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2203, గ్రేడ్ బీ రకానికి రూ.2183 నిర్ణయించినందని వెల్లడించారు. నిబంధనల మేరకు రైతులు తమ ధాన్యాన్ని శుభ్రంగా తీసుకువచ్చి, మద్దతు ధర పొందాలని సూచించారు.

ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం

రబీ సీజన్ కోతలు మొదలైన దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 13మండలాల్లో ఏప్రిల్ 1న ఒక్కో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తెలిపారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం జిల్లాలో ఈ రబీ సీజన్లో దాదాపు 3లక్షల నుంచి 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందని వెల్లడించారు. ధాన్యాన్ని సేకరించేందుకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో 201, ఐకేపీ ఆధ్వర్యంలో 44, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 10, మెప్మా ఆధ్వర్యంలో4 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు వివరించారు. ఏప్రిల్ 15వ తేదీ వరకు అన్ని కేంద్రాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అవసరం అయితే ఇంకా కేంద్రాలు ఎక్కువ ప్రారంభిస్తామని పేర్కొన్నారు. రైతులకు టోకెన్లు ఇవ్వాలని, దాని ప్రకారం కొనుగోళ్ల చేయాలని సూచించారు. ఈ సారి ఐరిస్ యంత్రాలు కూడా పంపిస్తామని, ధాన్యం కొనుగోలు చేసినప్పుడు రైతు ఐరిస్ కూడా తీసుకోవాలని సూచించారు. ఆయా కొనుగోలు కేంద్రాలకు కేటాయించిన రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించాలని, రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా శాఖల అధికారులు కొనుగోళ్ల నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు.

అందుబాటులో పరికరాలు

జిల్లాలో అవసరం మేరకు అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ వెల్లడించారు. టార్పాలిన్లు 8454, తూకం వేసే యంత్రాలు 265, ప్యాడీ క్లీనర్లు 613, తేమ శాతం చూసే మెషిన్లు 570 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని రైతులు వీటిని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ మద్దతు ధరకే ధాన్యాన్ని విక్రయించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షలో డీసీఎస్‌ఓ జితేందర్ రెడ్డి, జిల్లా మేనేజర్ జితేంద్ర ప్రసాద్, డీఎంఓ ప్రవీణ్ రెడ్డి, డీఆర్డీఓ శేషాద్రి, డీటీఓ లక్ష్మణ్ పాల్గొన్నారు.

టెట్ ఫీజు తగ్గించాలి



నవతెలంగాణ-బోథ్

టెట్ ఫీజు తగ్గించాలని బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో డీటీ మల్లేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం టెట్ ఫీజును పెంచుతూ పేద కుటుంబాలకు చెందిన అభ్యర్థులపై భారం మోపిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.400 ఉన్న ఫీజులను రూ.1000 పెంచడం అన్యాయమన్నారు. పెంచిన ఫీజును వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మల్లెపూల సుభాష్, మల్లెపూల స్వామి, రాజేందర్, రాథోడ్ రవి, గోపాల్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో దత్తాత్రేయ, సాయిబాబా విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు గురువారం హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, నాయన్నగారి మురళీరెడ్డి పాల్గొన్నారు. దత్తసాయి ఆలయ విగ్రహ ప్రతిష్టపాన సందర్భంగా జడ్పీటీసీ ఓస రాజేశ్వర్ పూజలు నిర్వహించి ఆలయ అభివృద్ధికి రూ.5వేలు విరాళంగా అందజేశారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి



నవతెలంగాణ-బోథ్

ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని సోనాల గ్రామ కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకుడు గాజుల పోతన్న మాట్లాడుతూ ఆత్రం సుగుణను అభ్యర్థిగా ప్రకటించినందుకు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు హేమంత్, బలిరాం, లోలపు పోశెట్టి, మహి, అమృత్‌రావు పాటిల్, నగేష్ పాల్గొన్నారు.

చెక్ పోస్ట్ వద్ద రూ.90 వేల నగదు సీజ్



నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమగూడెం చొప్పరిపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ వద్ద కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎటువంటి ఆధారాలు లేకుండా బెజ్జూరుకు చెందిన మొర్లె తిరుపతి రూ.90 వేల నగదు తరలిస్తుండగా పోలీసులు సీజ్ చేశారు. సీజ్ చేసిన నగుదును తదుపరి చర్యల నిమిత్తం ఎస్ఎస్టీ టీంకు అప్పగించినట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో అల్యూమినియం దొంగతనం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని వెంకటాపూర్ శివారులోని పత్తి చేసులో గల 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లోని 23 కిలోల అల్యూమినియం కాయిల్స్ దొంగతనంకు గురైనట్లు దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. సుమారు రూ.5000 విలువ గల ట్రాన్సాఫార్మర్లోని ఆల్యూమినియం కాయిల్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసినట్లు విద్యుత్ శాఖ ఏఈ శేర్ల స్వర్ణలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.